# 5. రాతి అరుగు

అది వెన్నెల రాత్రి. అర్ధరాత్రి అవుతోంది. ఆ వెన్నెల చిక్కగా వుంది. అంతే గాకుండా ,చిలిపిగా వుంది. అంతే గాకుండా, చల్లగా వుంది. చల్లగాలి మెల్లగా, మెత్తగా, మత్తుగా వీస్తోంది.

ఆ పట్నంలో ఆ పేట నిద్ర పోతోంది. ఆ పేట చివర, అందమైన చిన్న ఇల్లు వుంది. ఆ ఇంటి డాబా మీద, సన్న జాజుల పందిరుంది. ఆ పందిరి మీద గుంపులు గుంపులుగా, విచ్చుకున్న సన్న జాజుల గుత్తులున్నాయ్. ఆ సన్న జాజులు నవ్వుతున్నాయ్. ఆ నవ్వులు వెన్నెల్లా తెల్లగానే గాకుండా, సుగంధాల మంద హాసాల్లా వున్నాయ్.

ఆ ఇంటికి వీధి అరుగు వుంది. ఆ అరుగు, రోడ్డుని ఆనుకుని వుంది. ఆ రాతి అరుగు, పొడుగ్గా సన్నంగా వుండి, ఎత్తుగా కూడా వుంది. దానికి ఒక చివర్న ఒక వీధి కుక్క నిద్ర పోతోంది. రెండో చివర్న ఒక ఆడ మనిషి, నిద్ర పోకుండా, కూర్చుంది.

ఆమె నల్లగా వుంది. ఆమె చిక్కి పోయి, ఎముకల గూడులా వుంది. చింకి చీర కట్టుకుంది. ఆ చీర, చీకటి పొదలా, ఆమెలా, నల్లగా వుంది. ఆమె దరిద్ర దేవత గీసిన ఆకలి బొమ్మలా వుంది.

ఆమెకు కుడి చెయ్యి పడిపోయింది. ఆ చెయ్యి, ఆమె స్వాధీనంలో లేదు.

ఆ నిశ్శబ్ద వాతావరణంలో - ఆమె ఆకలి గోడు - శ్మశానంలోని నక్కల కూతల్లా భయంకరంగా వుంది.

ఆమె తన ఆకల్ని పాటగా విలపిస్తోంది. ఆమె తన వ్యథల్ని కన్నీటి వర్షంలా కురిపిస్తోంది.

ఆమె గోడు వింటే - వారం నుంచీ పిడికెడు మెతుకులు గానీ, - గుక్కెడు గంజి గానీ లేనట్లు తెలుస్తోంది. ఆమె కళ్ళు చీకట్లు కమ్ముతున్నట్లు - ఆమె స్పృహ తప్పి పోతున్నట్లు గూడా తెలుస్తోంది.

అప్పుడే ఆ రోడ్డు మీంచి ఒక కుంటి కాలు వ్యక్తి వస్తున్నాడు. అతడు కర్ర ని టిక్కు టిక్కు మని శబ్దం చేస్తూ, జోరుగా వస్తున్నాడు. అతడు చాలా ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. అతడికి ఒక కాలు, లావుగా, బలంగా వుంది. రెండో కాలు - ఎండిపోయిన పుల్లలా వుంది. అది

పొట్టిగా వుండి, వేలాడు తోంది. ఆ కాలికి పాదం లేదు. అతడి జుత్తు బాగా పెరిగి గుబురుగా వుంది. గడ్డం ఒత్తుగా, ఎత్తుగా వుంది.

అతడి మెళ్లో - చిరిగి పోయిన తుండు గుడ్డ వుంది. ఆ గుడ్డ చివర్న అన్నం మూట వుంది. ఆ అన్నం మూట, అతడికి ఆనందాన్ని ఇస్తోంది. అలాగే ఉత్సాహాన్నీ - బలాన్నీ ఇస్తోంది.

అతడు ముష్టి వాడు.

జోరుగా వస్తున్న అతడు, ఏడుస్తున్న ఆడ మనిషిని చూసాడు. వేగంగా వచ్చిన అతడు, కొన్ని నిమషాలు మౌనంగా నిలబడ్డాడు. ఆమెనే గాకుండా, ఇటూ- అటూ పరిశీలనగా చూసాడు. ఆమె ఎందుకు ఏడుస్తూందో నిమషంలో తెల్సు కున్నాడు.

ఆ అరుగు మీదకు చేరాడు. ఆమెకు కనబడేటట్లు, అన్నం మూటను, వెన్నెల పడుచున్న చోట విప్పాడు.

'ఏడుత్తే, కూడెడతా డేటి ఓడైనా?' అని 'తిను' అని చెప్పి, అన్నంలో కొంత ఆమె కిచ్చాడు. అలా అన్నం అమె కిచ్చి, కొరకొరా ఆమెలోకి చూసాడు.

ఆమెకు కళ్లు చీకట్లు కమ్ముతున్నాయ్. ఒళ్ళు జోగుతూంది. చేతులు వణుకుతున్నాయ్. ఆమె కళ్లు, అతడి చూపుల్ని తెల్సుగున్నాయ్. అయినా, - తిను అనగానే తిండం మొదలు పెట్టింది.

'నీ మొగోడు ఎక్కడున్నాడు?' అని అడిగాడు.

'సచ్చి పోనాడు, అగ్గురారం బుగత కాడ పెద పాలి కాపుగా ఉండే వోడు! ఆడు పందేనికి కత్తులు కట్టిన పుంజునాటోడు! బుగతల కొట్లాటల్లో - బుర్ర సిదిగి సచ్చినాడు!' అని ఆమె వెక్కి వెక్కి ఏడ్చింది. ' ఆడు సవటన్న మాట! మద్ది నాడెందుకు సచ్చినాడు బుగతల తగూల్లో! ' అని ' ఆయాల్టి నుంచీ సిప్పట్టుకున్నా వన్న మాట!' అని చమత్కరించాడు.

' అలా గనక! నాకు బందుగులోరూ నేరు. ఉన్నా సేర దీయ నేదు. కూలీ-నాలీ సేసి, కొంత కాలం బతికాను. అంతలో ఇసంజొరం అట్టుకుంది. కాళ్లు - సేతులూ పడిపోనాయ్. కొంత కాలానికి - కాళ్లూ - ఎడం సెయ్యి కుసింత కూడు కున్నాయ్. కుడిసెయ్యి కుదురవ్వ నేదు. కూలికి పనికి రాకుండా అయ్యి పోనాను. . . ' అని ఆమె నెమ్మది నెమ్మదిగా, ఏడుస్తూనే చెప్పింది.

' ఆ! అద్గదీ! ఆయాల్టి నుంచీ సిప్పట్టుకున్నా వన్న మాట!' అని అతడు మళ్లీ చమత్కరించాడు. ఆమె ఏడుపు నవ్వు నవ్వింది.

అంతలో - పెద్ద గాలి వీచింది. వీధి దీపాలు ఆరి పోయాయ్. వెన్నెల తగ్గి పోయింది. కుక్కలు మొరుగుతున్నాయ్.

'నాను సస్తానోరి! నీ జివ్వడా!' ఆని ఆమె తిడుతోంది.

'తొంగొ! తొంగో! ఒల్లక తొంగో! నాను నీకు కూడు ఎందుకు ఎట్టేను?! నువ్వు నా కూడెందుకు తిన్నావు?! నీ ఆకలి నీది! నా ఆకలి నాది! మడిసికాడ ఇవ్వడానికేంనేనప్పుడు, ఆడికి ఓడూ ఏటీ ఇవ్వడు! బతుకంటే అద్దదీ!!' అని చెప్పి, ఆమెకు మంచి నీళ్లు ఇచ్చి, తొంగో మని కూక వేసి, అతడు నిద్ర పోయాడు.

* * *

జీవితంలో అవసరం వాళ్లను ఆ రాత్రి అలా కలిపింది.

ఆ వేళ నుంచీ వాళ్లు కలిసి బతుకు తున్నారు. అతడు తిరిగి, తిరిగి, ముష్టి కూడు తెస్తున్నాడు. అది పంచుకు తింటూ బతుకుతున్నారు. ఆమెను ఆదుకున్నందుకు, అతడికి కృతజ్ఞతగా, విశ్వాసంగా, వుంటూంది. అసహ్యమైన , నీచమైన తన జీవితంలో ఆమె ఒక నిట్టూర్పు అని అతడు సంతోషంగా వుంటున్నాడు.

ఆమె ఇప్పుడు భయం లేకుండా నిద్ర పోతోంది. ఆమె ఇది వరకు ఆ అరుగు మీద భయంతో నిద్ర లేకుండా గడుపుతూ వుండేది. అప్పుడప్పుడు ఆమెనిద్రలో వున్నప్పుడు-ఎవడెవడో వచ్చి, గిల్లి గిల్లి, కనబడకుండా పారిపోయేవాళ్లు! ఇప్పుడు ఆమెకు ఆ భయం లేదు.

స్త్రీకి పురుషుడు రక్షణ కోసం ఎంతో అవసరమని తెల్సుకున్నట్లు, ఆమె అతడికి అంకితమైనట్లు బతుకుతోంది.

* * *

ఆ విధంగా కొంత కాలం గడిచింది.

అతడు సంపాదించిన కొద్ది ఆహారం ఇద్దరు పంచుకోడం జరుగుతోంది. అంచాత అతడికి ఆకలి తీరటం లేదు. ఆకలి బాధ అతడికి చాలా బాధగా వుంటోంది. ఆమె అలా తన సంపాదన తింటూ కూర్చోడం అతనికి మరీ బాధగా కనబడుతోంది.

అమె కూడా కుసింతో- కసింతో ముష్టి ఎత్తుకుని తెస్తుందని అనుకున్నాడు. ఆమెతో ఆ మాట ఎన్నో సార్లు అన్నాడు. కానీ ఆమె అందుకు ఒప్పుకోలేదు.

'కుడిసెయ్యి కుసింత ఆడితే, కూలి పనిసేస్తాను! కష్టపడి బతుకుతాను! నాను అడుక్కుని బతకనేను! గుమ్మం గుమ్మం ఎక్కి, నాను దేవరించనేను! నువు గూడ కూలిపని సెయ్య గలవు! ఇద్దరం కూలి పని సేసుకుని, కష్టపడి, బతుకుదాం!' అని ఆమె ముష్టి ఎత్తుకుని బతకనని చెప్పి, ఆతణ్ని కూడా కూలిపని చేసుకుని బతకమని చెప్పింది.

ఆ మాటలు విన్న అతడి మనసు వికలమై పోయింది. ఆమె కూడా ముష్టి ఎత్తుకుని కొంత తెస్తే, ఇద్దరూ కలిసి ముష్టి జీవితాన్ని సుఖంగా గడపొచ్చని అతడు ఎంతో ఆశించాడు. కానీ ఆమె అందుకు ఒప్పుకోలేదు. అంచాత అతడు మంటల్లో మండిపోతూ - కాలిపోతున్న జీవితాన్ని గడుపుతున్నాడు.

* * *

అది చీకటి రాత్రి. అర్ధ రాత్రి అవుతోంది. ఆ చీకటి- చీకటి చీకటిగా - ఆకాశం నీడలా - నల్ల నల్లగా వుంది. అతడు పక్కన వుండడం వల్ల - అమె ధీమాగా – నిర్భయంగా, గాఢంగా, నిద్ర పోతోంది.

అతడు నెమ్మదిగా లేచాడు. నెమ్మదిగా తన సామాన్లు అన్నీ మూట కట్టాడు. ఒక చింకి గుడ్డ ఆమె మీద కప్పాడు. చిరిగి పోయిన గోనె ముక్కను ఆమె కోసం వదిలి వేసాడు.

ఆ చీకట్లో అతడు బయలు దేరాడు. రైల్వే స్టేషను వైపు నడిచాడు. అతడు ఆ వూరు వదిలి వెళ్లిపోయాడు.

(ప్రగతి - సచిత్ర వార పత్రిక – 18-07-1969)